క్లుప్తంగా

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని ఆజాద్‌నగర్‌లోగల బృంద వృద్ధాశ్రమంలో కమలాపురం ఏపీడీఎస్ సోమశేఖర్ రెడ్డి తన తండ్రి దివంగత గురవి రెడ్డి సంస్మరణగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు ఉమ, పరమేశ్వర్ రెడ్డి, సుమంత్, వృద్ధాశ్రమ నిర్వాహకులు బాలసుబ్బయ్య. సుధారాణి పాల్గొన్నారు.

■ కడపకు చెందిన దునూతల రేణుక సుమలలిత జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కడప నగరంలో అన్నదానం నిర్వహించారు. కడపకు చెందిన టి.ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేట్టారు. సుమారు 40 మంది పేదలు, అభాగ్యులకు అన్నదానం చేశారు. దాతలు సేవా కార్యక్రమాలతో పేదలను ఆదుకోవాలని కోరారు.

సబ్సిడీపై జనుము విత్తనాలు

చింతకొమ్మదిన్నె : ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జనుము, విత్తనాలు అవసరమున్న ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి సూచించారు. చింతకొమ్మదిన్నె మండలానికి 50 శాతం సబ్సిడీతో పచ్చి రొట్ట విత్తనాలు, జనుములు 50 క్వింటాళ్లు పంపిణీకి మంజూరయ్యాయని తెలిపారు. జనుము విత్తనాల కోసం రైతు సేవ కేంద్రం నమోదు చేసుకోవాలన్నారు. కావలసిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ తప్పనిసరిగా తీసుకొని సంబంధిత రైతు సేవ కేంద్రం వద్ద సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కమలాపురం : స్థానిక పోస్టాఫీసు ఎదుట ఉన్న శ్రీ సాయి హాస్పిటల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన మమత హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు అందులో పేర్కొన్నారు. ప్రముఖ స్త్రీ వాధి, కాన్పులు, సంతాన సాఫల్య నిపుణురాలు డా. కె. జయసత్య శిబిరానికి వచ్చే మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు. తెల్లబట్ట, గర్భ సంచి గడ్డలు, రొమ్ములో గడ్డలు, పేగు జారడం, నెలసరి సమయంలో సమస్యలు తదితర వ్యాధులకు చికిత్సలు చేస్తారని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

నేటి నుంచి బాలల కోసం ప్రత్యేక కార్యక్రమాలు

కడప కల్చరల్ : ఆంధ్ర- కర్ణాటక సబ్‌జోన్ అదనపు ఇన్‌ఛార్జి, సీనియర్ రాజయోగిని గీత దీదీ ఆధ్వర్యంలో గురువారం నుంచి కడప నగరంలో ప్రత్యేక బాలల శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. నగరంలోని ఓం శాంతి నగర్ సేవా కేంద్రం ఓం నివాస్ భవనంలో బ్రహ్మకుమారీలు చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమం ఈనెల 24వ తేది వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఈ శిక్షణా శిబిరంలో పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం క్రియేటివ్ మెడిటేషన్, యోగా, నీతి కథలు, స్ఫూర్తిదాయకమైన ఆటల పోటీలు తదితర అంశాలను ప్రత్యేకంగా నేర్పించనున్నారు. 8 సంవత్సరాల వయస్సు నుండి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వక్ఫ్ చట్ట సవరణలు ఉపసంహరించుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్ట సవరణలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ కో-ఆర్డినేటర్ ఎస్ ఏ సత్తార్, నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, నగర కో ఆర్డినేటర్, బండి జకరయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో వక్ఫ్ చట్ట సవరణలపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తార్ తయారు చేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా అనేక చట్టాలు చేసిందన్నారు. వక్ఫ్ చట్టం సవరణలు ఉపసంహరించే వరకు ఉద్యమం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహమ్మద్, నగర మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్, అక్రమ్, నాసిర్ హుస్సేన్, బిసి సెల్ అధ్యక్షులు కులాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో పశువుల దాణా

పెండ్లిమర్రి : పాడి రైతులకు యాభై శాతం సబ్సిడీతో పశువుల దాణా, పశుగ్రాస విత్తనాలు మంజూరైనట్లు పశువైద్యాధికారి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతగా 7 టన్నుల దాణా అందుబాటులో ఉందన్నారు. ఒక్కో పాడి రైతుకు 50 కేజీలు మాత్రమే ఇస్తామన్నారు. 50 కేజీల బస్తా ధర రూ.1100లు సబ్సిడీ పోను రూ.555 చెల్లించి పాడి రైతులు తీసుకెళ్లాలని ఆయన కోరారు.

శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

నేడు హనుమజ్జయంతి

కడప కల్చరల్ : శక్తి సామర్థ్యాలకు, విశ్వాసానికి, కార్యదక్షతకు, పట్టుదలకు ప్రతీక హనుమంతుడు. ఆయన అండగా ఉంటే దుష్టశక్తులు దరిచేరవన్నది భక్తుల విశ్వాసం. నిజానికి ఆయన కూడా మనలాగా ఒక భక్తుడే.. కానీ తన అసమాన భక్తి విశ్వాసాలతో మానవ లోకానికి ఆరాధ్యుడయ్యాడు. రామయ్య భక్తునిగా ఆయన కూడా ఒక దేవుడయ్యాడు.. పూజలందుకుంటున్నాడు. కడప జిల్లాలో ఆయనకు సంబంధించిన పలు విశేషాలు ఉన్నాయి. గురువారం హనుమజ్జయంతి నేపథ్యంలో 'సాక్షి' పాఠకుల కోసం ఆ వివరాలు.

■ ఇక్కడి పలు ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఆ స్వామికి సంబంధించిన విశేషాలతో ముడిపడి ఉన్నాయి. అందులో ముఖ్యంగా కడప నగరంలోని దేవుని కడప ఒకటి. తిరుమల తొలి గడపగా పేరొందిన దేవుని కడప శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయానికి పాలకుడు హనుమంతుడు. దేవుని కడపలో స్వామి మూల విరాట్ వెనుక దాదాపు 12 అడుగుల హనుమంతుని కుడ్య శిల్పాన్ని నేటికి మనం చూడవచ్చు. కడప రాయుని ఆలయం ఎదురుగా పుష్కరిణి వద్ద బేడి ఆంజనేయస్వామి ఆలయం ఉంది. తిరుమల తిరుపతి దేవస్థానాలు కడప రాయుని ఆలయాన్ని విలీనం చేసుకున్నాయి.



కడప నగరం బ్రాహ్మణవీధిలోని ఆంజనేయ స్వామి ఆలయం

■ కడప నగరంలో తొలిసారిగా నిర్మించినది ఆంజనేయస్వామి ఆలయమే. నవాబుల కాలంలో దీన్ని నిర్మించారు. బుగ్గ వంక ఒడ్డున బ్రాహ్మణ వీధి ప్రారంభంలో ఈ పురాతన ఆలయం ఉంది. ఒకప్పుడు కడప నగరాన్ని పాలించిన నవాబులు ఈ ఆలయాన్ని బ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా కట్టించి ఇవ్వడం విశేషం. కడప నగరంలో నిర్మించిన తొలి ఆలయం ఇదేనని చెప్పవచ్చు.

■ జిల్లాలో అత్యధిక మంది భక్తులు వచ్చే ఆలయాలలో వేంపల్లె వద్ద గల గండి వీరాంజనేయస్వామి ఆలయం మొదటి రెండు స్థానాల్లో ఉంటోంది. శ్రీరామచంద్రుడే స్వయంగా తన బాణం ములికతో శిలపై ఆంజనేయుడి రూపాన్ని చెక్కాడని భక్తుల విశ్వాసం. ఆ విగ్రహమే ఇక్కడ మూలవిరాట్‌గా పూజలందుకుంటోంది. ఇక్కడి రెండు కొండల గండి మధ్య బంగారు తోరణం ఉందని పుణ్యాత్ములకు తుది ఘడియల్లో మాత్రమే అది కనిపిస్తుందని చెప్పుకుంటారు. బ్రిటీష్ అధికారి సర్ థామస్ మన్రోకు ఆ తోరణం కనిపించిందన్న కథనం నేటికి వినిపిస్తోంది.

■ జిల్లాలో రాజుపాలెం మండలంలోని సంజీవ రాయుని (హనుమంతుని) ఆలయం కూడా ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఈ స్వామిపై భక్తితో ఈ ప్రాంత వాసులు సంజీవరాయుడు, సంజీవయ్య, సంజీవమ్మ అని పేర్లు పెట్టుకుంటారు.

■ ప్రొద్దుటూరులోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గల సైకత లింగం హనుమంతుడు కాశీ నుంచి తెచ్చినదేనని స్థానిక కథనం ద్వారా తెలుస్తోంది.

■ ప్రపంచంలో ఏ రామాలయాన్ని చూసినా రాముడు సీతాలక్ష్మణ హనుమ సమేతంగా కనిపిస్తాడు. హనుమంతుడు లేకుండా ఉన్న ఆలయం మన జిల్లాలోని ఒంటిమిట్ట మాత్రమే. ఇక్కడ స్వామి, అమ్మవార్లకు హనుమంతుడు పరిచయం కాకముందే జాంబవంతుని ద్వారా ఇక్కడి మూల విరాట్ ప్రతిష్ఠింపబడ్డాయని క్షేత్రపురాణం చెబుతోంది.

■ జిల్లాలో దాదాపు 300కుపైగా ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. కడప నగరంలో 25కి పైగా ఉన్నాయి.

ప్రారంభమైన హనుమజ్జయంతి పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలో హనుమజ్జయంతి పూజలు రెండు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి మంగళ, బుధ వారాల్లో దాదాపు అన్ని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఈ కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి కడప నగరంలోని ఆంజనేయస్వామి ఆలయాలలో గణపతిపూజ, రుద్రాభిషేకం, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. ఆలయ ఉత్సవాల్లో భాగంగా మంగళ, బుధ వారాలలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల్లో భాగంగా గురువారం నవగ్రహ జపాలు, దీక్షా హోమం ఉంటాయని, రుద్రహోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం 12.00 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5.00 గంటలకు గ్రామోత్సవం ఉంటాయన్నారు. చిన్నచౌకులోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నామని ప్రధాన అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నామని, స్వామికి ప్రత్యేక పూజలు, సింధూరం అలంకారం, వడమాల సేవ తదితరాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.

■ స్థానిక మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోగల హనుమంతుని ఆలయంలో గురువారం ఉదయం 5 గంటల నుంచి పూజలు ప్రారంభించనున్నారు. ప్రధాన అర్చకులు ఇంద్రకంటి రఘువీరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తారన్నారు.

హౌసింగ్‌బోర్డు రామాలయంలో..

హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకంతోపాటు ఏకాదశ, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి తెలిపారు. అనంతరం స్వామికి అభిషేకం, అలంకరణ, అష్టోత్తర శత నామావళి, ఇతర పూజలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



హనుమంతుని మూల విరాట్

• విశ్రాంతి గదులు లేక..



వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండులో విశ్రాంతి గదులు లేకపోవడంతో డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెల్లవారుజామునే డ్యూటీకి వెళ్లాల్సిన వారు ఎక్కడా సదుపాయం లేక ఆర్టీసీ బస్సుల్లోనే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. బస్టాండు పరిసరాలు కూడా పరిశుభ్రంగా లేకపోవడంతో ఒక వైపు దోమల మోత, మరోవైపు చలితో నానా అవస్థలు పడుతున్నారు. వారు రాత్రంతా సక్రమంగా నిద్రపోతే పొద్దున్నే ప్రయాణీకులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో డ్రైవింగ్ చేసేటప్పుడు తూగితే బస్సులోని ప్రయాణీకులకు ప్రమాదం తప్పదు. ఆర్టీసీ అధికారులు ఈ విషయాన్ని గుర్తించి డ్రైవర్లు, కండక్టర్లకు మౌళిక వసతులతో విశ్రాంతి గదులు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫోటోగ్రాఫర్, కడప





గుండె జబ్బులపై అవగాహన అవసరం

కడప కల్చరల్ : జీవన శైలిలో ఆహార, వ్యాయామ మార్పులు ఎంతో ప్రాధాన్యత వహిస్తాయని సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు ఆర్. శ్రీనివాసులరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞానం శిక్షణా కార్యక్రమంలో గుండె జబ్బుల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గుండె జబ్బుల తీవ్రత అధికంగానే ఉందని, ధూమపానం, మద్యపానం, తక్కువ శారీరక శ్రమ, ఒత్తిడి, ఆందోళన, అనారోగ్యకరమైన ఆహారం వంటి ఆధునిక జీవన శైలిప్రమాద కారకాలని, కొరోనరీ హార్ట్ డిసీజ్ ప్రమాదాన్ని పెంచుతున్నాయని ఆయన వివరించారు. 70 నుంచి 80 శాతం గుండె జబ్బులను రెగ్యులర్ చెకప్‌ల ద్వారా ముందుగా గుర్తించవచ్చని, తద్వారా త్వరగా నయం చేసేందుకు వీలు ఉంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థులచే గుండె అవగాహన పోస్టర్లను తయారు చేయించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు దేవదత్తం చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఇప్పుడు అనేక మంది గుండె వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. ఉన్నట్టుండి గుండె పనిచేయటం ఆగిపోతే వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా వారిని కాపాడుకోవచ్చని చెప్పారు. అత్యంత అవసరమైన సీపీఆర్ గురించి దేశంలో 98 శాతం మందికి తెలియకపోవటం బాధాకరమని, సి పి ఆర్ విధానాన్ని బాలలకు వివరించారు.



గుండెజబ్బుల నివారణపై రూపొందించిన పోస్టర్లతో విద్యార్థులు

పిచ్చమ్మ కుటుంబానికి ఆశ్రయం కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాధితురాలు పిచ్చమ్మ కుటుంబానికి ఆశ్రయం కల్పించాలని సీపీఐ నాయకులు కోరారు. నాలుగేళ్ల కిందట రూ. 4 లక్షల అప్పు తీసుకున్నందుకు వడ్డీల మీద వడ్డీలు వేసి ఫోర్జరీ డాక్యుమెంటు తో పన్నులు, కరెంట్ బిల్లు మార్చుకొని శివానందపురంలోని పిచ్చమ్మ ఇంట్లో సామాన్లను కాజేసి, ఇంటిని కూల్చివేసిన బాల గురవయ్య తదితరులపై చర్యలు చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి యస్.వెంకట శివ డిమాండ్ చేశారు. బుధవారం కడప తహసీల్దార్ నారాయణరెడ్డికి నిరాశ్రయులు, బాధితురాలు పిచ్చమ్మ , కూతురు వెంకటసుబ్బమ్మ, కుమారుడు వెంకటసుబ్బయ్యలతో కలిసి సీపీఐ నాయకులు వెంకట శివ, భాగ్యలక్ష్మి లు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఈనెల 18న పిచ్చమ్మ ఇంటిపై దాడి చేశారని, పిచ్చమ్మ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఆ కుటుంబం కడప తహసీల్దార్ కార్యాలయ వరండాలో, ప్రాంగణంలోనే ఉంటారన్నారు. ఈ అమానుష ఘటనపై నిందితులను శిక్షించి బాధితులను ఆదుకోవాలని, లేకపోతే ఆందోళన చేపడుతామన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బాధితురాలు పిచ్చమ్మ, సీపీఐ నాయకులు

• మేఘం కదిలెను..

కడప ఎడ్యుకేషన్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో గత రెండు రోజుల నుంచి జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. దీంతోపాటు బుధవారం సాయంత్రం ఒక్కసారి ఉన్నట్లుండి ఆకాశమంతా మేఘావృతమై చిరుజల్లులు పడటంతోపాటు మేఘాలు దోబూచులాటతో కడప నగర వాసులను చల్లదనంతో ఆహ్లాదం పంచాయి.



విద్యార్థినికి బంగారు పతకం

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె కడప నగరం రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగంలో 2020 – 2024 బ్యాచ్ విద్యార్థిని వి.వెంకట నాగమణి బంగారు పతకం సాధించింది. అకాడమిక్స్‌లో 83.14 శాతం ఉత్తీర్ణత సాధించినందుకుగాను అనంతపురం జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) నిర్వహించిన 14వ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీద ప్రతిష్టాత్మక బంగారు పతకం అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ విద్యార్థినికి అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వెంకట రమణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న వెంకట నాగమణి

మాన్యం భూముల కౌలుకు వేలం



పెద్దపసుపులలో కౌలు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలోని శ్రీ మాధవ-ఆంజనేయ, శ్రీ ఈశ్వర-వీరభద్ర ఆలయాల మాన్యం భూములుకు ఆలయ అధికారులు వేలం పాట నిర్వహించారు. ఆయా ఆలయాలకున్న 197 ఎకరాలను మూడు సంవత్సరాల కౌలుకు ఇచ్చామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రీ మాధవ-ఆంజనేయ ఆలయానికి సంబంధించిన 145 ఎకరాలకు గాను 15,82,000, శ్రీ ఈశ్వర-అంజనేయ ఆలయానికి సంబంధించిన 54 ఎకరాలకు గాను 6,18,000 లక్షలు పలికినట్లు ఈఓ విశ్వనాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ అధికారులు, రైతులు, ఎస్ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీతో సాంకేతిక అభివృద్ధి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భారత దేశ మాజీ ప్రధాన మంత్రి దివంగత రాజీవ్ గాంధీతోనే దేశం సాంకేతికంగా అభివృద్ధి చెందిందని డీసీసీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్ పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతీయ యువత సాధికారత కోసం తీసుకున్న చర్యలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా చైర్మన్ కుల్లాయప్ప, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీక్‌ఖాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ సత్తార్, శ్యామలమ్మ, హరిప్రసాద్, శీలం గంగయ్య పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఒంటిమిట్టలో నేడు హనుమాన్ జయంతి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చింతరాజుపల్లి, మంగంపేట, పెద్దకొత్తపల్లి, ఒంటిమిట్టలోని చెరువు కట్టపై వెలసిన వీరాంజనేయస్వామి, ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం ఎదురుగా ఉన్న భక్త సంజీవరాయస్వామి ఆలయాల వద్ద అంజన్న జయంతి వేడుకలు జరుగుతాయి. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిచనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



మంగంపేట వీరాంజనేయస్వామి

28న మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్‌సర్వసభ్య సమావేశం ఈ నెల 28వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ సిద్దవటం మండల సర్వసభ్య సమావేశం 28వ తేదీ ఉదయం 10.00 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల పనితీరుపై చర్చ జరుగుతుందని, అధికారులు, మండలంలోని ప్రజాప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరుకావాలని తెలియజేశారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఎన్నారై సుబ్బారెడ్డి కుమారుడి వివాహ వేడుక పట్టణంలోని స్థానిక ఎస్సీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరై నూతన వధూవరులు రాహుల్‌కుమార్‌రెడ్డి, రూప మనోజ్ఞలను ఆశీర్వదించారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు బలరామిరెడ్డి, బయపురెడ్డి, హేమాద్రిరెడ్డి, సతీష్‌రెడ్డి కుమారుడు రోహన్ నాగిరెడ్డిలు వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



నూతన వధూవరులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితరులు

తెలుగు క్యాలెండర్ల అందజేత

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలోని స్థానిక వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలను రాయల్ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలి కృష్ణతేజలు కలిసి రాయల్ కాపునాడు నూతన తెలుగు క్యాలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో రాయల్ కాపునాడు సంఘ రాష్ట్ర కార్యదర్శి మూర్తి శ్రీనివాసులు రాయల్, కాపునాడు గౌరవ సభ్యులు కావలి హరినాథ్, పాలెం రంగనాథ్, సర్పంచ్, పలువురు రాయల్ కాపునాడు నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పులివెందుల రూరల్ : సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజా మొుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ డాక్టర్లకు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజామొుద్దీన్ హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయని, నీరు నిల్వలు ఉండే అవకాశం ఉందన్నారు. కావున దోమలు వృద్ధి చెంది జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలందరూ జాగ్రత్తగా ఉండి ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించాలన్నారు. ఎవరికైనా జ్వరంతో భాధపడుతుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్తపరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ చేయించుకొని చికిత్స చేయించుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజా మొుద్దీన్

మంచినీరు ఇవ్వండి మహాప్రభూ..



నిరసన తెలుపుతున్న చలమారెడ్డి కొట్టాలకు చెందిన మహిళలు



పక్క గ్రామాలకు ఆటోలో వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

సిద్దవటం : మండలంలోని చలమారెడ్డి కొట్టాల గ్రామంలో గత 5 రోజులుగా తాగునీటి సమస్య నెలకొని ఉండటంతో బుధవారం స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ చలమారెడ్డి కొట్టాల గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీలలో గత 5 రోజులు నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క గ్రామాలైన జ్యోతి, పి.కొత్తపల్లె, వెంకటయాపల్లె గ్రామాలకు ఆటోలలో వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామన్నారు. అంతేగాకుండా విద్యుత్ సమస్య కూడా ఉందని ఈ వర్షాలకు రాత్రి వేళల్లో దోమలు ఉన్నాయని కంటి నిండా నిద్రలేకుండా పోతోందన్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి తమ గ్రామానికి విద్యుత్, తాగునీటి సౌకర్యాలను కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.